సాక్షి నారాయణపేట

గురువారం ▪ 4 ▪ మే ▪ 2023



శ్రీగిరి ప్రదక్షిణ

జోగుళాంబ ఆలయంలో బుధవారం శ్రీగిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి 4,423 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 34.2 /24.4

వాతావరణం

ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోలీసు శాఖ వెన్నంటి ఉంటుంది



నారాయణపేట రూరల్: పోలీసు శాఖలో పనిచేస్తూ మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. మద్దూర్ పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ యూనస్ గత ఏడాది డిసెంబర్‌లో అనారోగ్య కారణాలతో మృతిచెందారు. మార్చిలో రూ.8లక్షల చెక్కును అందించగా, తాజాగా అడిషనల్ కార్పస్ ఫండ్ కింద మంజూరైన రూ.50వేల చెక్కును బుధవారం అందించారు. ఆయన కుటుంబ సభ్యులను స్థానిక కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుశాఖ అండగా ఉంటుందని, మిగిలిన బెనిఫిట్స్ తొందరగా వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన ఓపెన్ స్కూల్ పరీక్షలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ఓపెన్ స్కూల్ పరీక్షలు ముగిసినట్లు టాస్ కోఆర్డినేటర్ యాదయ్యశెట్టి తెలిపారు. బుధవారం చివరి పరీక్ష టెన్త్ వారికి భారతీయ సంస్కృతి–వారసత్వం సబ్జెక్టుపై జరిగిన పరీక్షకు ఒక సెంటర్‌లో ఒక విద్యార్థిని కేటాయించగా హాజరయ్యారు. అదేవిధంగా ఇంటర్ వారికి గణితశాస్త్రం పరీక్షకు 4 సెంటర్లలో 70మందికి 57మంది హాజరయ్యారు. 13మంది గైర్హాజరయ్యారు.

జిజ్ఞాస పోటీల్లో 'పేట' విద్యార్థుల ప్రతిభ



నారాయణపేట రూరల్: స్థానిక సీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో బుధవారం ప్రతిభ చాటారు. కళాశాలలో పరిశోధన, సృజనాత్మకతను పెంపొందించడానికి స్టూడెంట్ ప్రాజెక్టు పోటీలను ప్రదర్శించారని, జంతు, భౌతికశాస్త్రం, కంప్యూటర్ చరిత్ర విభాగాల్లో వినూత్న ప్రాజెక్టులను తయారు చేసి ప్రశంసలు పొందారని ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ నారాయణగౌడ్ తెలిపారు. భౌతికశాస్త్రం విభాగంలోని ప్రదర్శన ఉత్తమంగా నిలిచిందని, ప్రశంసాపత్రం అందిందని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగారెడ్డి అభినందించారు.

కెమికల్ ఫ్యాక్టరీల ఏర్పాటుతో ముప్పు



నర్వ: మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో కెమికల్ ఫ్యాక్టరీలకు వ్యతిరేకంగా ఈ నెల 15న ధర్నా నిర్వహిస్తున్నట్లు చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని చిత్తనూర్, హిందూపూర్‌లలో ఏర్పాటు చేస్తున్న కెమికల్ ఇథనాల్ ఫ్యాక్టరీలను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వాటితో ఈ ప్రాంత ప్రజల మనుగడకు ముప్పు తప్పదన్నారు. మేరకు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, బండారి మల్లేష్, మధు, కురుమూర్తి, బండారీ లక్ష్మయ్య తదితరులున్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,552

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకు గరిష్టంగా రూ.6,552, కనిష్టంగా రూ.4,384 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,819, కనిష్టంగా రూ.1,460, ఆముదాలు గరిష్టంగా రూ.5,481, కనిష్టంగా రూ.5,199, పత్తి గరిష్టంగా రూ.7,062, కనిష్టంగా రూ.6,012, హంస రకం ధాన్యం గరిష్టంగా రూ.1,860, కనిష్టంగా రూ.1,719, ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2,345, కనిష్టంగా రూ.1,358, పొద్దుతిరుగుడు గరిష్టంగా రూ.4,060, కనిష్టంగా రూ.3,960 ధరలు పలికాయి.


ఆ అధికారే కీలకం..

రిజిస్ట్రేషన్ కోసమే బది'లీలలు'..!

- వక్ఫ్ భూమికి ఎసరులో కొత్తకోణం
- కోస్గి తహసీల్‌లోని ఓ అధికారిదే ప్రధాన పాత్ర
- తొలుత కోస్గి నుంచి నారాయణపేట కలెక్టరేట్‌కు ట్రాన్స్‌ఫర్..
- 24 ఎకరాలు చొప్పున ఇనాం, టెనెంట్ దారులకు రిజిస్ట్రేషన్
- అనంతరం కోస్గి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ
- హైదరాబాద్ రియల్టర్ల పేరిట రిజిస్ట్రేషన్
- ఆ తర్వాత బడా వ్యాపారవేత్తల పేరు మీదుగా..
- సంచలనంగా మారిన ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధి భూదందా

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

నారాయణపేట జిల్లాలో వక్ఫ్ బోర్డుకు చెందిన కోట్లాది రూపాయల విలువైన ఇనాం భూమిని ఓ జిల్లాస్థాయి అధికారి అండతో ఓ నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి కాజేయడం కలకలం రేపుతోంది. కోస్గి మండలం ముక్తిపాడ్ గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకున్న ఈ భూబాగోతాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. సర్వే నంబర్ 19, 20, 50, 51లలోని 48 ఎకరాల భూమిపై కన్నేసి.. 24 ఎకరాలను మింగేసిన వైనంపై బుధవారం 'ఇనాం.. భోజనం!' శీర్షికన ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నిబంధనలు ఉల్లంఘించి కిద్మత్ ఇనాం భూములకు రిజిస్ట్రేషన్ చేయడం.. తహసీల్దార్‌కు సంబంధం లేకుండా కలెక్టరేట్ నుంచే అక్రమంగా ప్రక్రియను పూర్తి చేసిన ఈ తతంగంలో తవ్వేన కొద్దీ కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి. కోస్గి మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారే దీనికి సూత్రధారి అని తెలుస్తోంది. అంతేకాదు ఈ భూమిపై ఇదివరకే కన్నేసిన అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు సమూహంగా ఏర్పడి ఇనాందారులతో విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు. 'బాస్' స్వయంగా రంగంలోకి దిగడంతో చేసేదేమీలేక వారు వెనుకడుగు వేశారు.



అక్కడ, ఇక్కడ ఒక్కడే..

నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఓ అధికారి ఈ భూబాగోతంలో కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. జిల్లాస్థాయి అధికారితో పాటు నియోజకవర్గ ప్రజాప్రతినిధికి సమాచారం చేరవేసి.. ఇనాందారులు, టెనెంట్‌దారులతో సంప్రదింపులు జరిపి.. ఇరువర్గాలు సమానంగా 24 ఎకరాల చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఒప్పందం కుదర్చడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. మిగతా రిజిస్ట్రేషన్ ప్రక్రియను గుట్టుచప్పుడు కాకుండా సాగించింది మాత్రం కోస్గి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారే. అటు కలెక్టరేట్‌లో, ఇటు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లలో ఆయనదే ప్రధానపాత్ర అని విశ్వసనీయవర్గాల సమాచారం. నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధికి అతడు నమ్మినబంటు కాగా.. ఈ భూబాగోతం మొత్తానికి తెరవెనుక సూత్రధారి అతడేననే చర్చ రెవెన్యూ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

బదిలీలు.. లీలలు ఇలా..

ఈ భూవ్యవహారంపై నియోజకవర్గస్థాయి ప్రజాప్రతి**నిధి, జిల్లాస్థాయి** అధికారి ఓ అవగాహనకు వచ్చిన **తర్వాత చకచకా పా**వులు కదిపారు. నియోజకవర్గ స్థాయి **ప్రజాప్రతినిధి ఆదే**శాల మేరకు కోస్గి తహసీల్దార్ కార్యాల**యంలో పనిచేస్తున్న** ఓ అధికారిని నారాయణపేట కలెక్ట**రేట్‌కు బదిలీ చేశా**రు. అక్కడ ఆయన ఆధ్వర్యంలో నకిలీ **ధ్రువపత్రాలు** సృష్టించి 48 ఎకరాల్లో ఇనాందారులు, **టెనెంట్ దారులకు** 24 ఎకరాల చొప్పున రిజిస్ట్రేషన్ **చేశారు. ఈ ప్రక్రియ** ముగియగానే నెల రోజుల వ్యవధిలోనే సదరు అధికారిని మళ్లీ కలెక్టరేట్ నుంచి కోస్గి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇక్కడ ఇనాందారుల నుంచి 24 ఎకరాలను హైదరాబాద్ రియల్టర్ల పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఆ తర్వాత నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆదేశాలతో 11 ఎకరాల భూమిని హైదరాబాద్ రియలర్లు రూ.6.5కోట్లకు కోస్గిలోని ఇద్దరు బడా వ్యాపారవేత్తలకు విక్రయించారు. ఈ మేరకు సదరు అధికారి ఆధ్వర్యంలోనే కోస్గి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తయింది.

పోలీస్‌స్టేషన్‌కు చేరినా..

మరోవైపు కొందరు టెనెంట్‌దారులు డీల్‌కు ఒప్పుకోకపోవడంతో వారి మధ్య అంతర్గత కుమ్ములాటలు చోటు చేసుకోగా, బుజ్జగింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో భూములు కొలతలు చేసేందుకు వచ్చిన వారిపై దాడి చేయడంతో ఈ భూ పంచాయితీ కోస్గి పోలీస్‌స్టేషన్‌కు వరకు చేరింది. అయితే నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆదేశాలతో టెనెంట్‌దారుల గ్రామానికి (చెన్నారం) చెందిన పలువురు పెద్దలు జోక్యం చేసుకుని ఇరువర్గాల మధ్య రాజీ కుదర్చడంతో పోలీస్‌కేసు నమోదు కాలేదు. కాగా.. సుమారు రూ.30 కోట్ల విలువ చేసే 48 ఎకరాల ఇనాం భూములకు సంబంధించి పలువురు మైనార్టీ నాయకులు సమాచారహక్కు చట్టం కింద పూర్తి వివరాలు కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆర్టీఐ దరఖాస్తులో లోపాలను వెతికి.. అడ్రస్ కరెక్ట్‌గా లేదని.. అడిగిన వివరాలు సరిగా లేవని.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సమాధానం ఇస్తూ తప్పించుకుంటున్నట్లు సమాచారం.



అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ముక్తిపాడ్ పరిధిలోని ఇనాం భూమి ఇదే..

గ్రామాల్లో క్రీడల సందడి



మహబూబ్‌నగర్‌లోని ప్రధాన స్టేడియంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

- క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్
- ఈనెల 15 నుంచి టోర్నీల ప్రారంభం
- మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో పోటీల నిర్వహణ
- క్రీడల నిర్వహణకు మండల, జిల్లాస్థాయిలో కమిటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: చాలా ఏళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల సందడి నెలకొనున్నది. క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం చీఫ్ మినిస్టర్స్ (సీఎం కప్ 2023) క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించేందుకు ప్రతిష్టాత్మకం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల నూతన సెక్రటేరియట్‌లో సీఎం కప్ టోర్నీ నిర్వహణపై రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తొలి సంతకం చేశారు. అండర్–15 ఏళ్ల నుంచి అండర్–36 ఏళ్ల పురుష, మహిళా క్రీడాకారులు సీఎం కప్ టోర్నీలో పాల్గొనవచ్చు.

మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు

మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సీఎం కప్ క్రీడా టోర్నీల నిర్వహణ చేపట్టనున్నారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మండలస్థాయి సీఎం కప్ టోర్నీలు నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌లో పోటీలు ఉంటాయి. మండలస్థాయిలో విజేత జట్లకు జిల్లాస్థాయి పోటీలకు పంపుతారు. మండలస్థాయిలో ఈ పోటీల నిర్వహణ కోసం కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీఓ మెంబర్ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈఓ లేదా గజిటెడ్ హెచ్‌ఎం, ఎస్ఐ, మున్సిపల్ ఏరియాలో కమిషనర్, పీడీ లేదా పీఈటీ సభ్యులుగా ఉంటారు.

జిల్లాస్థాయిలో 11 క్రీడాంశాల్లో పోటీలు

జిల్లాస్థాయిలో 11 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. పురుష, మహిళలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్‌తో పాటు పురుషులకు బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు ఉంటాయి. జిల్లాస్థాయి క్రీడా పోటీలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లాస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీల నిర్వహణ కోసం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) కో–వైస్ చైర్మన్‌గా, డీవైఎస్ఓ కన్వీనర్‌గా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు లేదా కార్యదర్శి, జిల్లా విద్యాశాఖాధికారి, జనరల్ మేనేజర్ ఇండస్ట్రీస్, మున్సిపల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయి గెలుపొందిన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్రస్థాయిలో ఈనెల 28 నుంచి 31 వరకు 18 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

గ్రామీణ క్రీడాకారులకు సీఎం కప్ వరం



సీఎం కప్ క్రీడాపోటీలు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు వరంలా మారనుంది. రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల, జిల్లాస్థాయిలో సీఎం కప్ క్రీడా టోర్నీలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇందులో రాణించే క్రీడాకారులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయి. క్రీడాకారులు మండల, జిల్లాస్థాయిలో సీఎం కప్ క్రీడాపోటీలను సద్వినియోగం చేసుకోవాలి. – **ఎస్.శ్రీనివాస్,** జిల్లా యువజన, క్రీడల అధికారి, మహబూబ్‌నగర్

ప్రోత్సహించేందుకే..



గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలకు పెట్టడానికి తీసుకున్న నిర్ణయం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జిల్లాలో క్రీడాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారు. మంత్రి నేతృత్వంలో సీఎం కప్ క్రీడాపోటీలు విజయవంతమవుతాయి. ఈ పోటీలకు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం తరపున మా వంతు సహకారం అందిస్తాం. – **జగన్‌మోహన్‌గౌడ్,** పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

తడిసిన ధాన్యం కూడా కొనండి



భూనీడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

మద్దూరు: ఇటీవల అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం కొత్తపల్లి, మద్దూరు మండలాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఏ గ్రేడ్ వరి ధాన్యం క్వింటా రూ.2,060, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తపల్లి మండల కేంద్రంలో ఆంజనేయస్వామి అలయ పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ప్రారంభించారు. తిమ్మారెడ్డిపల్లి దగ్గర పెద్దవాగుపై నిర్మాణం చేస్తున్న వంతెన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, షేక్‌మీరాన్, గోవిందమ్మ, వెంకటేష్, సత్యమ్మ, అరుణ, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, పార్టీ నాయకులు బాల్‌సింగ్‌నాయక్, వెంకటయ్య, హన్మిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి, వీరేష్‌గౌడ్, చంద్రశేఖర్, వెంకట్‌రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

కోస్గి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో గుండుమాల్ మండల కేంద్రంలో, బోగారంలో, కోస్గి పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టం కలగకుండా మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారుల్ని నమ్మి తక్కువ ధరకు ధాన్యం అమ్ముకొని నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం ఉన్నప్పటికి కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, వైస్ చైర్మన్ వర ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా ఇళ్ల అవసరాలకు ఇసుక

మాగనూర్: జిల్లా ప్రజలు ఇళ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని జిల్లా మైనింగ్ ఆర్ఐ రమేష్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఆర్ఐ శ్రీశైలంతో కలిసి మండల పరిధిలోని వర్కూర్, మాగనూర్ పెద్దవాగు సమీపంలో ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఇసుక– మన వాహనం ద్వారా బుక్ చేసుకున్న వారికే ఇసుకను సరఫరా చేస్తారని తెలిపారు. ఇలా చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభించడంతో పాటు, ఇసుక అక్రమ రవాణాను అరికట్టవచ్చని తెలిపారు. ముఖ్యంగా మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాలకు కూడా ఇళ్ల నిర్మాణం కోసం ఇసుక బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించామని తెలిపారు.



మాగనూర్ శివారులో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సామాజిక సేవలో ముందుండాలి



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్డీఓ రాంచందర్

నారాయణపేట రూరల్: వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సామాజిక కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుండాలని ఆర్డీఓ రాంచందర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981–83 బ్యాచ్‌లో ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు నెల రోజులుగా పట్టణంలోని చౌక్‌సెంటర్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. ఎన్నో పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వస్తున్న గ్రామీణ ప్రజలకు వేసవిలో తాగునీరు అందించడం అభినందనీయమని అన్నారు. రఘువీర్‌యాదవ్, సత్యనారాయణ, సాయిబాబా, వెంకట్రాములు, అశోక్, రామకృష్ణ, జగదీష్, దేవన్న, వెంకటపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ర్యాలీ



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నారాయణపేట రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నాలుగేళ్ల పాటు పంచాయతీల్లో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయడంలేదని, సీఎం కేసీఆర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయిలో బెస్ట్ జీపీలుగా తెలంగాణ నుంచే ఎక్కువశాతం ఎంపిక కావడంలో తమ పాత్ర ఎంతో ఉందని, రాష్ట్రానికి చక్కటి పేరుప్రతిష్టలు తెచ్చిన తమని విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. జ్యోతి, చాణిక్యవర్ధన్‌రెడ్డి, బబిత, మహేష్, నవిత, శ్రీనివాస్, బస్వరాజ్, అనురాధ, శివకుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. 'సైబర్ ముప్పు' అనే శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంతో ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి పీఎస్‌లో ఒక గ్రామానికి వెళ్లి ప్రత్యేకంగా శిబిరాలను ఏర్పాటు చేసి అక్కడి ప్రజలతో మాట్లాడి అవగాహన కల్పించారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్‌ఫోన్ ఇవ్వడం చేయరాదన్నారు. అనవసరమైన లింకులు మొబైల్‌కు వస్తే ఓపెన్ చేయరాదని, లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎక్కడైనా అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 193కుగాని డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పీఎస్‌ల హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీ

నారాయణపేట రూరల్: జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో బుధవారం వాహనాల తనిఖీ ముమ్మరంగా కొనసాగింది. సీఐ రవిబాబు మాట్లాడుతూ బోగస్ ఓటర్లను తరలించే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని, మద్యం, వస్తువుల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.



క్లుప్తంగా

ఉస్మానియాలో యువకుడు మృతి

కోస్గి: హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని కడంపల్లికి చెందిన కార్పెంటర్ వడ్ల రవి(38) తాగుడుకు బానిస కావడంతోపాటు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడక పోవడంతో జీవితంపై విరక్తి చెంది, గతనెల 28న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ సంఘటనపై మృతుని సోదరుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మితోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గాంధీ ఆస్పత్రిలో వ్యక్తి..

చిన్నచింతకుంట: హైదరాబాద్‌లోని గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం అమ్మపూరం గ్రామానికి చెందిన సుతారి రాంచంద్రయ్య(60) మృతి చెందారు. ఎస్సై మోహన్‌బాబు కథనం ప్రకారం.. ఏప్రిల్ 22న రాంచంద్రయ్య అమ్మపూరం నుంచి కురుమూర్తి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు 108వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. రాంచంద్రయ్య అన్న కూతురు సుజాత బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆత్మకూర్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్ఐ అంజద్‌అలీ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని తిప్పడంపల్లికి చెందిన నవీన్ కుమార్ (21) గత నెల 25న ఆత్మకూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గ్రామశివారులోని లీడర్స్ స్కూల్ వద్ద అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు 108 వాహనంలో ఆత్మకూర్ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో ఆ తల్లి రోదనలు మిన్నంటాయి.

ఉత్తరప్రదేశ్ యువకుడు..



కల్వకుర్తి టౌన్: కల్వకుర్తిలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన బీరేందర్ (35) బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. యువకుడు బీరేందర్ పెయింటర్ పనిచేసేందుకు పట్టణానికి వలస వచ్చాడు. సోమవారం తను ఉంటున్న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. విద్యానగర్ కాలనీలో రోడ్డుపై జారిపడ్డాడు. విషయం తెలియడంతో అతని సహచరులు స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చనిపోయాడు. కుటుంబసభ్యులు లేకపోవడంతో సహచరులు అంత్యక్రియలు నిర్వహించడానికి ముందుకురాలేదు. దీంతో పట్టణానికి చెందిన యువకులు ఖాదర్, ఖాజా, ఇమ్రాన్, గౌస్, షాకీర్, ఉస్మాన్ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యువకులకు పలువురు అభినందించారు.

కుక్కల దాడిలో 37 గొర్రె పిల్లలు మృతి



ఉండవెల్లి: కుక్కల దాడిలో పంట పొలాల్లో ఉన్న 37 గొర్రె పిల్లలు మృత్యువాత పడినట్లు గొర్రెల కాపరులు తెలిపారు. వారి కథనం మేరకు.. బుధవారం మండల కేంద్రం సమీప పొలాల్లో నిలిపి ఉంచిన గొర్రెల మంద నుంచి పిల్లలను వేరుచేసిన కాపరులు గొర్రెలను మేతకు తీసుకెళ్లగా అక్కడే ఉన్న కుక్కలు పిల్లలపై దాడి చేయడంతో కాపరి మురళికి చెందిన 25, బీసన్నకు చెందిన 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వివరించారు.

గడ్డివాము దగ్ధం

మానవపాడు: గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని అమరవాయిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని కాబుల్ అనే రైతు గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో పూర్తి కాలిపోవడంతో రూ.90 వేల వరకు నష్టం జరిగిందని రైతు వాపోయారు. ఘటనకు పాల్పడిన వారిని పట్టుకొని బాధితుడికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

జోగుళాంబ ఆలయంలో గిరి ప్రదక్షిణ

- శ్రీశైలం దేవస్థానం నుంచి హాజరైన ప్రత్యేక బృందం
- స్వాగతం పలికిన జోగుళాంబ ఆలయ ఈఓ, అర్చకులు



మహన్యాస పూర్వకరుద్రాభిషేకాలు



జోగుళాంబ ఆలయంలో శ్రీగిరి ప్రదక్షిణ చేస్తున్న ఆలయాల అర్చకులు, సిబ్బంది

జోగుళాంబ శక్తిపీఠం: శ్రీశైలం దేవస్థానం ఈఓ లవన్న ఆదేశాల మేరకు శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం అలంపూర్ పుణ్యక్షేత్రంలో శ్రీగిరిప్రదిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైల దేవస్థానం నుంచి ప్రత్యేక బృందం అలంపూర్ చేరుకోగా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ముఖ్య అర్చకుడు ఆనంద్ శర్మ వారికి ఘన స్వాగతం పలికారు. దేవస్థానంలో వారు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాకారంలో గో సహిత ప్రదిక్షణ నిర్వహించారు. అనంతరం రస సిద్ధి స్వరూపుడైన సంకల్ప సిద్ధి గణపతికి అభిషేకాలు, అలంకరణలు అర్చనలు, నివేదనలు నిర్వహించారు. ఆలయ అర్చకులతో పాటుగా శ్రీశైలం దేవస్థానం నుంచి వచ్చిన వేదపండితులు, అర్చకులు ముక్తకంఠంతో మహన్యాస పారాయణాలు చేశారు. ప్రధాన ఆలయంలో కొలువు దీరిన బాల బ్రహ్మేశ్వరుడికి నమక చమకాలతో 11 పర్యాయాలు ఏకదశ రుద్రాభిషేకాలు చేశారు. జోగుళాంబ అమ్మవారికి త్రిశతి, ఖడ్గమాల అర్చనలు చేశారు. అనంతరం శ్రీశైల దేవస్థానం తరపున శేషవస్త్రాలను ప్రసాదాలను అందజేయగా, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ జోగుళాంబ దేవస్థానం నుంచి శ్రీశైల దేవస్థానం ప్రతినిధుల బృందానికి శేషవస్త్రాలతో పాటు వేద ఆశీర్వచనం చేయించారు. ఏటా శ్రీశైలం దేవస్థానం నుంచి తూర్పున ఉన్న త్రిపురాంతరం, దక్షిణాన ఉన్న సిద్ధవటం, పశ్చిమాన ఉన్న అలంపూర్, ఉత్తరాన ఉన్న ఉమామహేశ్వరంకు వెళ్లి అక్కడి క్షేత్రాలలో ప్రదిక్షణలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఇప్పటికే త్రిపురాంతరం, సిద్ధవటం, అలంపూర్ పూర్తి చేయగా గురువారం ఉమమహేశ్వరం చేరుకుంటామని శ్రీగిరి ప్రదిక్షణ నిర్వహాక కమిటీ ఇన్‌చార్జ్ ఎస్.సాయికుమార్ తెలిపారు.

ప్రాంతాల మధ్య సత్సంబంధాలు

భూమండలానికి నాభిస్థానంగా చెప్పబడే శ్రీశైల మహాక్షేత్రానికి నాలుగు ద్వారాలుగా పిలువబడే తూర్పు-త్రిపురాంతకం, ఉత్తరం-ఉమామహేశ్వరం, దక్షిణ-సిద్ధవటం, పశ్చిమం-అలంపూర్ క్షేత్రాలలో త్రేతాయుగంలో శ్రీరాముల వారు ప్రదిక్షణలు నిర్వహించి అనంతరం శ్రీశైలం చేరుకుని పరమేశ్వరుడికి సేవించాడట. ఆనాటి నుంచి నేటి వరకు శ్రీగిరి ప్రదిక్షణ పేరిట ఈ సాంప్రదాయంను శ్రీశైలం దేవస్థానం వారు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. శ్రీగిరి ప్రదిక్షణనే కాక పద్మ ప్రదిక్షణ పేరిట పద్మాకారంగా ఉన్న శ్రీశైలం పర్వతం చుట్టూ అంటే గంగాధర్ మండపం ప్రదిక్షణలు నిర్వహిస్తున్నారు. ఇలా చేయడం ద్వారా ఆధ్యాత్మిక ప్రయోజనాలతో పాటు ప్రాంతాల మధ్య భక్తిపూర్వకమైన సత్సంబంధాలు మరింత బలపడుతున్నాయి. కార్యక్రమంలో వేదపండితులు పవన్‌కుమార్, సుబ్రమణ్యశర్మ, బ్రమరాంబిక ఆలయ ముఖ్య అర్చకుడు సత్యనారయణ శర్మ, సంతోష్‌కుమార్, సిద్ధేశ్వర్, ఉమామహేశ్వర్, మల్లికార్జున్ ఉన్నారు.

నందిన్నె చెక్‌పోస్టు తనిఖీ



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ సృజన

కేటీదొడ్డి: కర్ణాటక సరిహద్దులోని కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్‌పోస్టును ఎస్పీ సృజన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టు పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఉంచాలని ఎస్ఐలకు సూచించారు. కర్ణాటక నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాన్ని క్షుణ్ణంగా తనికీ చేయాలని డబ్బులు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

మద్యం పట్టివేత

మండలంలోని నందిన్నె చెక్‌పోసు వద్ద వాహనాల్లో తనిఖీల్లో భాగంగా రాయచూర్ నుంచి గద్వాల వైపు వస్తున్న వాహనాలను తనిఖీలు నిర్వహించగా 12 బీర్ బాటిళ్లు, 13 ఒరిజినల్ చాయిస్, 4 రాయల్ విస్కి, 2 ఇంపీరియల్ బ్లూ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న కుర్వ మాద్రెప్పపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



కండక్టర్ ఇందిరమ్మను అభినందిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి

మన్ననూర్: ఆర్టీసీ సంస్థలోని అన్నిస్థాయిల అధికారులు, సిబ్బంది ప్రత్యేక కృషి చేసినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ (ఆర్‌ఎం) శ్రీదేవి అన్నారు. బుధవారం అమ్రాబాద్ మండల కేంద్రం, మన్ననూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లను ఆమె పరిశీలించారు. అంతకుముందు వివిధ ప్రాంతాలకు చెందిన రహదారుల్లో (రూట్‌లలో) పర్యటించిన ఆమె ఆర్టీసీ మనుగడకు ఈ ప్రాంతంలో చేపట్టాల్సిన చర్యలపై అచ్చంపేట డీఎం రాజశేఖర్‌తో చర్చించారు. అచ్చంపేట మద్దిమడుగు ప్రధాన రహదారిలో నిత్యం ఎన్ని బస్సులు తిరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కండక్టర్లు ఉపయోగించే ఈపీకె బుక్కులను పరిశీలించారు. ప్రయాణికులను చిరునవ్వుతో పలకరిస్తూ మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్న అచ్చంపేట డిపోకు చెందిన కండక్టర్ ఇందిరమ్మను అభినందించారు. కార్యక్రమంలో సీఐ సౌజన్య, టీఐటూ జోగమ్మ, వెల్ఫేర్ కమిటీ సభ్యుడు చంద్రయ్య, జీఆర్ రెడ్డి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

వేసవి శిబిరంతో వెలుగులోకి క్రీడాకారులు



వేసవి శిబిరంలో క్రికెట్ కోచింగ్ ఇస్తున్న కోచ్ ప్రేమ్‌కుమార్


- టీసీఏ సౌత్‌జోన్ ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్
- జిల్లా కేంద్రంలో వేసవి ఉచిత క్రికెట్ క్యాంప్ ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలతో ప్రతిభావంతులు క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) సౌత్‌జోన్ ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని శ్రీనివాసకాలనీ టీసీఏ క్యాంప్‌లో బుధవారం వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఔత్సాహిక క్రీడాకారులకు క్రికెట్‌లో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారులకు టీసీఏ ఒక వేదికలా ఉపయోగపడుతున్నదన్నారు. ఆరేళ్ల నుంచి జిల్లాకేంద్రంలో టీసీఏ ఆధ్వర్యంలో ఉచిత క్రికెట్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో అండర్-10, అండర్-14, అండర్-16, అండర్-19, అండర్-29 విభాగాల క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందజేస్తామని చెప్పారు. వేసవి శిబిరంలో ప్రతిభకనబరిచే ఆయా విభాగాల క్రీడాకారులకు టీసీఏ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయి లీగ్‌లకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 31 వరకు వేసవి ఉచిత క్రికెట్ శిబిరం ఉంటుందని, ఆసక్తి గల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మన్యంకొండ లక్ష్మీనారసింహస్వామి ఉత్సవాలు ప్రారంభం



హనుమాన్ వాహన సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీలక్ష్మీ నారసింహస్వామి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శుద్ధి పుణ్యాహవాచనం, అంకురార్పణ, స్నపన తిరుమంజనం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామివారి హనుమత్ వాహనసేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, హనుమాన్ వాహనంపై ఉంచి ఊరేగింపు చేపట్టారు. ఆలయ ప్రాంగణం నారసింహస్వామి నామస్మరణతో మార్మోగిపోయింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బీచుపల్లి బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అయిదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మొదటిరోజు ఉదయం పంచామృతాభిషేకం, వాస్తు పూజ, హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం, రాత్రి తెప్పతేరు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఉమారాణి, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

దేవరకద్ర రూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. దేవరకద్రకు చెందిన కోస్గి భగవంతు బుధవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లారు. రెండు గంటల తర్వాత తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 4 తులాల బంగారం, వెండి వస్తువులు, కొంత నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చోరీ కేసు నమోదు

నాగర్‌కర్నూల్ రూరల్: ఇంటి తలుపులు పగలగొట్టి నగదు, బంగారం అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ప్రిజమ్ స్కూల్ సమీపంలో బాలరాజు తన ఇంటికి తాళం వేసి సొంత పనులపై ఊరెళ్లాడు. మూడు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడి రూ.2లక్షల నగదు, రెండు తులాల బంగారం చోరీ చేశారు. బాలరాజు బుధవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం విరగ్గొట్టి ఉండడం, ఇంట్లోని బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీ: కేసు నమోదు

మహమ్మదాబాద్: ఎదురెదురుగా వెళ్తున్న ట్రాక్టర్ ఆటో ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన జానంపల్లి వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కప్లాపూర్‌కు చెందిన కావలి నర్సింలు తన ఆటోలో వరహగిరిపల్లి దగ్గర పనిచేస్తున్న వ్యక్తి హజ్జురాంను ఆటోలో తీసుకుని వెన్నాచేడ్‌వైపు సిలిండర్ కోసం వెళ్తున్నాడు. ఇదే సమయంలో వెన్నాచేడ్ గ్రామానికి చెందిన గుండాల మల్లయ్య తన ట్రాక్టర్‌తో అతివేగంగా వెళ్తూ, మధ్యలో ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటోలో కూర్చున్న హజ్జురాం తలకు, కుడి భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సైదయ్య తెలిపారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి, పార్టీకి పునర్వైభవం తీసుకురావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ మినీ మహానాడు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో టీడీపీ తీసుకొచ్చిన అనేక పథకాలు నేడు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని, గతంలో తీసుకువచ్చిన సంస్కరణలు రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పు జరిగిందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందని పేర్కొన్నారు. అందుకోసం వచ్చే ఎన్నికల నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. అందుకోసం టీడీపీ ఇంటింటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అడ్డా కూలీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

సాక్షి ఎఫెక్ట్..

జడ్చర్ల టౌన్: 'అడ్డా లేక అవస్థలు' శీర్షికతో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 1న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించారు. కార్మికులకు శాశ్వత అడ్డా కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. భవన నిర్మాణ కార్మికుల అడ్డా యూనియన్ కార్యవర్గంతో ఆయన మాట్లాడారు. సిగ్నల్‌గడ్డ, కల్వకుర్తి రోడ్‌లో అడ్డా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గంజ్ సమీపంలో ఉన్న రైతు బజార్ వద్ద తమకు కల్పించాలని యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. త్వరలోనే సమస్యకు పరిష్కారం చూయిస్తామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మే డే కానుక అమలు చేయాలి



మే డే వారోత్సవాల్లో పాల్గొన్న సురేష్

జడ్చర్ల టౌన్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రకటించిన మే డే కానుక రూ.వెయ్యి జీతం పెంపును ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు కూడా వర్తింపజేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బాదేపల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో జెండా ఎగరవేసి మాట్లాడారు. వేతనం పెంచిన జాబితాలో ఆస్పత్రి కార్మికులు లేకపోవటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యావత్ కార్మికవర్గం ఐక్యపోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు దేవానందం, ఆస్పత్రి కార్మికులు నాగరాజు, విజయలక్ష్మి, శివలీల, అలివేల, సుక్కమ్మ, సత్తెమ్మ, అలివేల, మణెమ్మ, శివ, జానకిరామ్, నరసింహ, చిన్న పాల్గొన్నారు.

జూరాలకు 4,423 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీశైలం జలాశయం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లోలు వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.నాలుగు రోజులుగా కురుస్తున్న స్థానిక వర్షం ఆధారంగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వస్తున్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4,423 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా...రాత్రి ఏడు గంటల వరకు ప్రాజెక్టు నీటి మట్టం 315.450 మీటర్లుగా ఉంది. కాగా.. ఎగువన ఉన్న ఆలమట్టి నీటి నిల్వ సామర్థ్యం 129 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 26.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు. దిగువకు 5,115 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 19.46 టీఎంసీల నీరు ఉంది. ఈ ప్రాజెక్టుకు 1643క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి 508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 806.6 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 806.6 అడుగులు, 32.3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్థానికంగా 14.20 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు ఎన్టీఆర్ కాల్వను బంద్ చేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

యువకుడి మృతి పై ఆందోళన



మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీహరి

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కాపురంలో మంగళవారం తెల్లవారుజామున పానుగంటి శేఖర్ (25) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం పోస్టుమార్టం అనంతరం గ్రామానికి మృతదేహం తీసుకవచ్చి అంత్యక్రియలు నిర్వహించే క్రమంలో మృతుని కుటుంబ సభ్యులు కొంత సేపు ఆందోళనకు దిగారు. గ్రామంలోని ఓ వ్యక్తి తన కూతురిని మృతిచెందిన యువకుడు ప్రేమించమని ఇబ్బంది పెట్టాడనే కక్షతో చంపి ఉంటాడని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీహరి సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. ఇప్పటికే ఈ విషయంలో కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు. అనుమానం ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. విచారణలో ఎవరైనా దోషులను తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వారికి నచ్చజెప్పారు.